




సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : అత్యవసర పరిస్థితుల్లో హృదయ స్పందనను పునరుద్ధరింపజేసేందుకు వైద్యశాస్త్రంలో నిర్దేశించిన సి.పి.ఆర్ పై నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్ లో ప్రత్యేక సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. హృదయ స్పందన ఆగిపోయినప్పుడు తిరిగి పని చేయించేందుకు నిర్వహించే సి.పి.ఆర్ పై అవగాహన పెంపొందించుకోవాలని రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సుందర రాజు తెలిపారు. సి.పి.ఆర్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ఎసి సుబ్బారెడ్డి మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ చేసి చూపించారు. నగరపాలక సంస్థ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్ డా జిజియా, హెల్త్ ఆఫీసర్ డా కనకాద్రి, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న డాక్టర్లు మరియు హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.



కళాశాలలా.. మృత్యు కూపాలా..!

తమ పిల్లలు బాగా చదువుకొని మంచి భవిష్యత్తు కోసం లక్షల రూపాయల ఫీజులు చెల్లిస్తోన్న కొందరి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగులుతోంది...కేవలం నాలుగు నెలల కాలంలో నెల్లూరు జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో ఐదుగురు విద్యార్థులు అనుమానాస్పదంగా మృతిచెందారు.ఇప్పటికీ ఆ మరణాలకు కారణాలు తెలియడం లేదు...తల్లిదండ్రులు ఆశలపై యాజమాన్యాలు నీళ్లు చల్లుతున్నాయి..మానసిక ఒత్తిడి... యాజమాన్యం దూకుడుగా వ్యవహరించడం...తోటి విద్యార్థుల మధ్య ఘర్షణలు...ఫీజుల కోసం వేధింపులు....ఇలా అనేక విషయాలు ముందుకు వస్తున్నాయి... ప్రభుత్వం, విద్యాశాఖ మరణాల విషయంలో జోక్యం చేసుకొని వాస్తవాలు భయటపెట్టాల్సింది. కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు రాజకీయ నేతలుగా అవతారం ఎత్తడంతో అధికారులు మౌనంగా ఉంటున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి..

- నాలుగు నెలల్లో ఐదుగురు ఆత్మహత్య
- ప్రయివేటు కళాశాలల్లో దారుణాలు
- మానసిక ఒత్తిడి...యాజమాన్యాల దూకుడు
- తల్లిదండ్రులకు పుత్రశోకం
- విద్యాశాఖ నిర్లక్ష్యపు ధోరణి


విద్యార్థి మృతదేహం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో విద్యార్థులు అనుమానాస్పదంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో కళశాలల యాజమాన్యాలు విద్య విషయంలో మానసిక ఒత్తిడి కారణంగా కనిపిస్తుండగా, మంచి ర్యాంకుల కోసం నిత్యం విద్యార్థులను ఇబ్బందులు పెట్టడం, ఫీజుల కోసం వేధింపుల కారణంగా తెలుస్తున్నాయి. విద్య విషయంలో రాష్ట్రంలోనే నెల్లూరుకు మంచి గుర్తింపు ఉంది. నెల్లూరుతోపాటు కడప, చిత్తూరు, ఒంగోలు, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు ఇక్కడ ఇంటర్, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో చదువుతున్నారు. ఇటీవల కాలంలో తల్లిదండ్రులు పిల్లల చదువు కోసం భారీగా ఖర్చుపెడుతున్నారు. ఇంజినీరింగ్ కోసం ఎంపిసి, మెడిసన్ కోసం బైపిసిలో చేర్పించి, ర్యాంకుల కోసం అటు తల్లిదండ్రులు, ఇటు కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్నారనే ప్రధాన విమర్శలున్నాయి. గతంలో నిత్యం ఆర్ఐఒ,తోపాటు ఇతర విద్యాశాఖ అధికారులు నిత్యం కాలేజీలను పర్యవేక్షించేవారు. ఇప్పుడు అది కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణంగా కాలేజీ యాజమాన్యం రాజకీయాల్లో రావడమే కారణంగా కనిపిస్తోంది. ఎంఎల్ఎ, ఎంఎల్‌సి, మంత్రులకు కాలేజీలు ఉండడంతో విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకోవడం లేదు. అందుకే ఇష్టానుసారం యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి.

4 నెలల్లో ఐదుగురు విద్యార్థులు మృతి...!

కొడవలూరు మండలం, రాజుపాళెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతోన్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో కాలేజీ యాజమాన్యం బెదిరింపులే కారణంగా చెబుతున్నారు. ఇటీవల అన్నమయ్య సర్కిల్ వద్ద ఆర్ఎన్ఆర్ కాలేజీలో చిత్తూరుకు చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఇది అనుమానాస్పదంగా చెబుతున్నారు. అంతకు ముందు భక్తవత్సలనగర్‌లోని విశ్వసాయి కాలేజీలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ధనలక్ష్మీపురంలోని విశ్వసాయిలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. ఇవి కేవలం నాలుగు నెలల కాలంలో జరిగినవి. ఇటీవల తరచూ విద్యార్థులు అనుమానాస్పదంగా చనిపోతూనే ఉన్నారు. ఇందుకు కారణాలను ప్రభుత్వం అన్వేషించడం లేదు. విద్యాశాఖ అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరుపుతున్నారు. ఇప్పటి వరకు ఒక్క కాలేజీ పైనా విచారణ జరిపి చర్యలు తీసుకున్న పరిస్థితులు కనిపించడం లేదు. కాలేజీల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డల చావుకు రోదించి, రోదించి వెళ్లిపోతున్నారు. షరా మామూలుగానే కనిపిస్తున్నాయి. ఈ సంఘటనపై విద్యార్థి సంఘాలు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఒక సమాచారం మేరకు విద్య వ్యవస్థలోని లోపాలు, మానసిక ఆరోగ్య సమస్యలు, చదువు ఒత్తిడి, వసతి గృహాల్లో పర్యవేక్షణ కొరత, వేధింపులు కౌన్సెలింగ్ సౌకర్యాల లోపం వంటి వ్యవస్థాగత వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

విచారణ జరపాలి..

జిల్లాలో తరచూ జరుగుతోన్న విద్యార్థుల ఆత్మహత్య విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ, పేరెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. నరహరి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి తోపాటు పలు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలానే ఉంటే విద్యార్థులు ప్రయివేటు కళాశాలల వైపు వెళ్లేందుకు భయపడతారని వాస్తవాలు బయటపెట్టాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ ధర్నా

నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఉదయ్ కిరణ్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని విఆర్‌సి సెంటర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర మాట్లాడారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు జి.విష్ణు జిల్లా నాయకులు బాబి, యశ్వంత్, జీవన్, సుమంత్, తాహిర్,అక్రమ్, సుకుమార్ ఉన్నారు.



విద్యార్థి ఆత్మహత్య

యాజమాన్య నిర్లక్ష్యం - తల్లిదండ్రుల ఆవేదన


ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ఉదయ్‌కిరణ్(ఫైల్)

ప్రజాశక్తి-కొడవలూరు

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం డిప్లమా చదువుతున్న ఉదయ్ కిరణ్ (19)బుధవారం రాత్రి హాస్టల్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. యాజమాన్యపు నిర్లక్ష్యం వల్లే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కడప జిల్లా పోరుమామిళ్ల కు చెందిన ఉదయ్ కిరణ్ కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమా కోర్సులో చేరారు. ఉదయ్ కిరణ్ ల్యాప్‌టాప్ దొంగిలించాడనే కారణంతో కళాశాల ఇన్‌చార్జి అన్నయ్య విద్యార్థిని మందలించి అవమానపరచడంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్ బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. మరణ వార్త విన్న ఉదయ్ కిరణ్ తల్లిదండ్రులు గురువారం ఉదయం కళాశాలకు చేరుకొని ఎంతో ఆవేదనకు గురయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ వివరాల మేరకు.. కొడవలూరు సిఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయ్ కిరణ్ ఆత్మహత్య వార్త తెలుసుకున్న స్థానిక విద్యార్థులు కళాశాలకు చేరుకుని కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఉదయ్ కిరణ్ ఆత్మహత్యకు కారణమైన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం న్యాయం చేయాలని వారు ఆందోళనలు చేపట్టారు. సిఐ సురేంద్రబాబు కలుగజేసుకొని విద్యార్థులతో స్థానిక నాయకులతో మాట్లాడి సర్ది చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అనంతరం ఉదయ్ కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రోధిస్తున్న విద్యార్థి తల్లి

ప్రపంచ ఆహార దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు

ఆహారాన్ని వధా చేయరాదని, విందు, వినోదాలు, శుభకార్యములలో భోజనమును వధా చేయడం సముచితం కాదని, తినడానికి తిండి దొరక్క అనేక దేశాల్లో ప్రజలు జీవచ్ఛావాలుగా మారుతున్నారని కందుకూరు టిఆర్ఆర్‌జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ నాగూర్ వలి అన్నారు.గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక చిన్నబజార్ పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల తనిఖీ చేశారు. గురువారం చిన్నబజార్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఎస్‌పి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పచ్చదనం పెంచాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిధులు, క్రైం చార్ట్ లను పరిశీలించి, అప్డేట్ చేయాలని, స్టేషన్ పరిధిలో ఉన్న నేర శాంతి భద్రతల పరిస్థితులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ గో బ్యాక్ అంటూ కర్నూలులో నిరసన తెలిపిన సిపిఎం నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.విభజన హామీలు, ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు విడుదలకు సంబంధించిన హామీలను విస్మరించి, జిఎస్‌టి 2.0.పేరుతో ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పేందుకు మోడీ కర్నూలు పర్యటనకు వచ్చారని ఎద్దేవచేశారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మోడీ భజన చేయకుండా విభజన చట్టంలోని హామీలను సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేదంటే ఎపి ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గ్రాండ్ ట్రంకు రోడ్డు గాంధీ బొమ్మ, కనకమహాలు కూడలి, కొత్త హాలు కూడలి, జేమ్స్ గార్డెన్, వెంకట రామాపురం తదితర ప్రాంతాలలో గురువారం పర్యటించారు. గ్రాండ్ ట్రంక్ రోడ్డులోని వివిధ ప్రాంతాలలో రోడ్డు ఆక్రమణలు తొలగించే ప్రక్రియను కమిషనర్ పర్యవేక్షించారు. డ్రెయిన్ కాలువలను దాటి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా సంబంధిత విభాగాల సచివాలయ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎక్సైజ్ సురక్ష యాప్ విడుదల

ప్రజాశక్తి-కందుకూరు : మద్యం దుకాణాలు, రెస్టారెంట్‌బార్లలో కొనుగోలు చేసిన మద్యం బాటిళ్ళు సురక్షితమైనవో లేవో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనముగా ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ను వినియోగదారుల సౌకర్యార్థం అందుబాటులోనికి తెచ్చినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ కందుకూరు ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. ఈ యాప్ ను ఎవరైనా ప్లే స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్ లో ఎపి ఎక్స్‌యిజ్ సురక్ష అని టైపు చేసి డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు.

పట్టాలు పంపిణీ చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : సిపిఎం 11వ డివిజన్ ఎన్‌టిఆర్ నగర్ శాఖల ఆధ్వర్యంలో స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తు స్థానిక ప్రజలతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. గురువారం ఉదయం నుంచి నగరంలో జోరున వర్షం కురుస్తున్నా ప్రజలు లెక్కచేయకుండా నిరసన ధర్నా కార్యక్రమానికి హాజరైయ్యారు. ఆర్డీవో అనూషతో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఫోన్లో సమస్య తీవ్రతను వివరించారు.సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ,నగర కమిటీ సభ్యులు ఆవుల పెంచలయ్య, ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శి గోతం మురళి లు మాట్లాడారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ నాగేశ్వరరావు, ఖాయంబు శ్రీనివాసులు నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, కత్తి పద్మ,ఎం చిరంజీవి,మాదాల శ్రీమన్నారాయణ, కె వి సుబ్బారావు, టి నారాయణ, పసుపులేటి మల్లికార్జున, రామిశెట్టి శ్రీనివాసులు ఉన్నారు.



అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - లింగసముద్రం : దీపావళి సందర్భంగా ప్రభుత్వ అనుమతి మరియు సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎవరైనా బాణసంచా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసిన, క్రాకర్స్ విక్రయించినా చర్యలు ఉంటాయని ఎస్ఐ నారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

స్థల పరిశీలన

కందుకూరు : దీపావళి పండగ సందర్భంగా టెంపరరీ ఫైర్ క్రాకర్ షాప్స్ కందుకూరు పట్టణ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో పెట్టుకొనేందుకు అనుమతి కొరకు అర్జీలు పెట్టారు. దీనిలో భాగంగా గురువారం అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చేశారు.సబ్ కలెక్టర్ హిమ వంశీ, తహసీల్దార్ లావణ్య, కందుకూరు డిఎస్పీ బాల సుబ్రమణ్య, మునిసిపల్ కమిషనర్ కె అనూష, సీఐ షేక్ అన్వర్ భాషా, ఫైర్ ఆఫీసర్ ఎస్ఐలు కలిసి జడ్పీ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ కు వెళ్ళి పరిశీలించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా నవీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు : ఓటరు జాబితా నవీకరణ కార్యక్రమం పాదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫారం 6 లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం 6 లను సంపూర్ణంగా పూర్తిచేసే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు నూతన ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. డి ఆర్ ఓ విజయ్ కుమార్, టిడిపి – రసూల్, వై ఎస్ ఆర్ సి పి – వెంకట శేషయ్య, బీఎస్పీ – శ్రీరామ్ హాజరయ్యారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

'రియల్' వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి గుడ్లూరు

ప్రభుత్వ భూములు కబ్జా చేసి వెంచర్లు వేస్తున్నన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేసింది. కబ్జాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదని పేర్కొంది. గుడ్లూరు మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ భూమిని, ఆక్రమించి దారి ఏర్పాటు చేయడాన్ని కమిటీ తప్పుబట్టింది. ఎక్కడైనా నిరుపేదలు భూములు ఆక్రమిస్తే, ఆగమేఘాల మీద పరుగెత్తే, అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే, నిమ్మకు నీరెత్తినట్లు మౌనవహించటం ఏమిటని కమిటీ సూటిగా ప్రశ్నించింది. కందుకూరు– గుడ్లూరు జాతీయ రహదారి పక్కన గుడ్లూరు శివారులోఎర్ర ప్రగడ విద్యుత్ ఉపకేంద్రం ఏడు ఎకరాలు పట్టా భూమి ఉంది. వభూమిని కందుకూరుకు చెందిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దారి లేకుండా అనధికార వెంచర్ ఏర్పాటు చేశారని పేర్కొంది. అధికార పార్టీ అండతో, ఒకరోజు రాత్రికి రాత్రే, విద్యుత్ సబ్ స్టేషన్ భూమిని కబ్జా చేసి రోడ్డు నిర్మించారని ఆక్షేపించింది. ఇప్పటికైనా రియల్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే ఆందోళనలు ప్రారంభిస్తామని సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ నాయకులు, జి వెంకటేశ్వర్లు, ఎంజాలయ్య, కొట్టే వెంకయ్య జి మల్లికార్జున, వి సిద్దయ్య దామ కృష్ణయ్య, ఎం వెంకటేశ్వర్లు హెచ్చరించారు.


రియల్ వ్యాపారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలం

జిఎస్‌టి '2.0'పై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : ప్రభుత్వ ఆదేశాలమేరకు కందుకూరు ఆర్‌టిఒ టీ వి. యన్ లక్ష్మీ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం గురువారం కందుకూరులో జరిగింది. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు వివిధ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు 4జిఎస్‌టి శ్లాబులు ఉండగా వాటిని 2 శ్లాబులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఇంటింటికి జీఎస్టీ 2.0 ఫలాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి వాహనాన్ని బట్టి మునుపటి జిఎస్‌టి మీద వాహన కొనుగోలుపై జిఎజ్‌టి 7శాతం నుంచి 10శాతం వరకు తగ్గించిందని తెలిపారు. కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీయన్ లక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 విధానాన్ని తీసుకురావడం వలన ముఖ్యంగా వాహనములతో పాటు వ్యవసాయరంగం, చేనేత ఉత్పత్తులు, విద్యారంగం, వాహన ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ సంబంధించిన వస్తువులపై జిఎస్‌టి తగ్గించడం అనేది ముఖ్యముగా మధ్యతరగతి కుటుంబాలకు సంతోకరమన్నారు. డిఎస్‌పి సి. హెచ్.వి బాలసుబ్రమణ్యం, మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం అనేది చాలా సంతోషకరమని తెలిపారు. కందుకూరు ఎంవిఐ జె.అనిల్ కుమార్, కందుకూరు సిఐ యస్. కె అన్వర్ భాష, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ యానాది, కందుకూరు టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావు, కందుకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జి హరిబాబు పాల్గొన్నారు.



అవుట్ సోర్సింగ్ కార్మికులకు

కార్మిక చట్టాలు వర్తింపజేయాలి

నెల్లూరు : ఆర్‌టిసి డిపోలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ '(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తులసీరామ్ ఆర్‌టిసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి డిపోలల్లో కాంట్రాక్టు కార్మికులకు చట్టాల అమలు తీరును పరిశీలిస్తున్న నాయకులు గురువారం నగరానికి చేరుకోని ఆర్‌టిసి ప్రధాన డిపోను పరిశీలించారు. డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను కలసి వారి పని విధానం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్‌తో కలిసి నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి నాగేంద్ర ప్రసాద్‌ను కలిశారు. అనంతరం డైరెక్టర్‌తో నాయకులు మాట్లాడుతూ ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న స్వీపింగ్,వాషింగ్,వివిధ రకాల పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలు కాంట్రాక్టర్ ద్వారా సరిగా అందే విధంగా చూడాలని ఔట్ సోర్సింగ్ కార్మికులకు హక్కులు, పనిగంటలు కార్మిక చట్టాలు, అమలు చేయాలని డిమాండ్స్ తో కూడుకున్న వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా పాల్గొన్నారు



రోడ్డు మార్జిన్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజకవర్గం పరిధిలోని 30, 31వ డివిజన్లో సిపిఎం శాఖల ఆధ్వర్యంలో రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయం చూపాలని కొంత సమయం ఇవ్వాలనీ కోరుతూ రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం నగరంలోని రూరల్ ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయానికి చేరుకున్న సిపిఎం నాయకులు, రోడ్డు మార్జిన వ్యాపారస్తులు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా 30 ,31వ డివిజన్ శాఖ కార్యదర్శులు బి నాగేశ్వర్ రెడ్డి కండే కోటేశ్వరరావు లు సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండ ప్రసాద్ రూరల్ కమిటీ సభ్యులు మాలకొండయ్య ,సిపిఎం శాఖ సభ్యులు హమీదు, రోడ్డు మార్జిన్ కార్మికులు పాల్గొన్నారు



ఉత్పత్తి సంఘాలు బలోపేతం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, యంత్రీకరణను సమ్మిళతం చేసుకుంటూ సరికొత్త ఆలోచనలతో రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రైతు ఉత్పత్తి సంఘాల పురోగతిపై 7వ జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలతో రైతులకు పరస్పర సహకారం, ప్రయోజనం చేకూరేలా రైతు ఉత్పత్తిసంఘాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 108 ఎఫ్‌పివోలు పనిచేస్తున్నాయన్న కలెక్టర్, ఈ సంఖ్యను 150కి పెంచాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్య, పశుసంవర్ధకశాఖల జెడిలు శాంతి, రమేష్‌నాయక్, నాబార్డు డిడిఎం బాబు, వ్యవసాయాధికారులు, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి-కందుకూరు : ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు పరిశుభ్రతగురించి వివరించి ర్యాలీ నిర్వహించారు. సమైక్యలో కూడా ఎజెండాపాయింట్ పెట్టి సంఘ సభ్యులు అందరికి కూడా అవగాహన కల్పించాలని ఆర్పీలను సీఎం ఆదేశించారు. సిఎంఎం సంపత్ కుమార్,సీఈవోలు మాధవి లతా,సురత్న కుమారి పాల్గొన్నారు.

లక్ష్మీనాయుడు కుటుంబానికి పరామర్శ


ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : లక్ష్మీనాయుడు హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కాపు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గుడ్లూరు మండలంలోని దారకానిపాడు గ్రామంలో పెద్దపవని– రాళ్లపాడు మార్గమధ్యలో దసరా పండుగ రోజు లక్ష్మీనాయుడు హత్యకు గురయ్యాడు. బాధిత కుటుంబాన్ని గురువారం యువ పారిశ్రామికవేత్త రామిశెట్టి వెంకట వంశీ . కాపు రాక్స్.జిల్లా అడ్మిన్ రామ్మోహన్ . ఆమంచి స్వాములు. ప్రసాద్ . బెల్లంకొండ విజయలక్ష్మి పరామర్శించారు. కుల దుహంకారంతో కాకర్ల ప్రసాద్ అనే వ్యక్తి లక్ష్మీనాయుడును హత్య చేశారన్నారు. హత్యకు గురైన లక్ష్మీనాయుడు భార్య వారికి జరిగిన విషయాలను వివరించారు. ప్రసాద్ అనే తనను ఫోన్‌లో మానసికంగా వేధించేవాడన్నారు. దాన్ని ప్రశ్నించామన్న కోపంతో తన భర్తను అన్యాయంగా చంపారని కన్నీరుమన్నీరైంది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రలోభాలకు లోనుకాకుండా పోలీసులు కేసును నిష్పక్ష పాతంగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు బాధిత కుటుంబాన్ని స్థానిక ఎంఎల్‌ఎ ఇంటూరి పరామర్శిం చకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వారి వెంట పలువురు కాపు నాయకులు ఉన్నారు.



వెల్డింగ్ మేస్త్రీ మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో డిజైన్ వెల్డింగ్ సీనియర్ మేస్త్రి షేక్ సంధాని బాషా గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. సంధాని భాషా మృతికి కందుకూరు పట్టణంలోని డిజైన్ వర్కర్స్ వెల్డింగ్ యూనియన్, కందుకూరు అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఫౌండ్రి వర్కర్స్ యూనియన్ సంతాపం తెలియజేస్తూ పట్టణంలో షాపులు మూసి వేశారు. కందుకూరు వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ కే గఫూర్,ఎస్ కే సుభాని మాట్లాడుతూ పట్టణంలో షేక్ సంధాని భాష అనేకమందికి వెల్డింగ్ పని నేర్పించి జీవన ఉపాధి కల్పించారని వారు నేర్పించిన పని వల్ల అనేకమంది స్వతంత్రంగా షాపులు పెట్టుకొని కుటుంబాలు జరుపుకుంటున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరమన్నారు. కందుకూరు అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఫౌండ్రీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ ప్రసాద్,ఎస్.కె అమురుల్లా, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మంచి మిత్రులు స్నేహశీలి మా సహచరుడు మరణించడం బాధాకరమన్నారు కందుకూరు వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ ,కందుకూరు అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఫౌండ్రి వర్కర్స్ యూనియన్ నాయకులు సభ్యులు సందాని బాషాకు నివాళి అర్పించారు. కందుకూరు పట్టణ మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వరు,ఎస్ కే చానా, పఠాన్ ,మున్నా ఖాన్ ,సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్కె సల్మా ,కందుకూర్ డిజైన్ వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్ ఎ గౌస్, లాయరు పోకూరి కోటయ్య, డి ఎం రాయుడు,ఎస్ కే రసూల్ ,జిలాని పాల్గొన్నారు.


సందాని బాషా(ఫైల్)

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ

వైసిపి ఆధ్వర్యాన సంతాకాల సేకరణ

కందుకూరు : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ,కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం కందుకూరు పట్టణంలోని 1 వార్డులో ప్రారంభించారు.వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో.కందుకూరు పట్టణం లోని 1 వ వార్డు లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైసిపి 1 వ వార్డ్ అధ్యక్షులుగా నగల్ల నారయ్య ను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా సెక్రెటరీ తోకల కొండయ్య,రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు గణేశం గంగిరెడ్డి, రాష్ట్ర కల్చరల్ వింగ్ అధికార ప్రతినిధి వల్లూరు కోటేశ్వరరావు, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యరమాల నాగభూషణం, జిల్లా నాయకులు పాశం కొండయ్య, పట్టణ ఉపాధ్యక్షులు తల్లపనేని గోపి,యడ్ల మాధవరెడ్డి, షేక్ రహీం,కరేటి సుబ్బారావు, మల్లిబోయిన శివకృష్ణ పాల్గొన్నారు.





వైద్యసిబ్బంది నిరసన

ప్రజాశక్తి-సంగం
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న డాక్టర్లు గత కొద్ది రోజులుగా చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. వైద్యుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ క్యాడర్ల నిర్ణయం చేస్తున్న 143 జిఒను రద్దు చేయాలని కోరారు. ఈ జిఒతో ఎఎన్ఎంలు, ఎంపిహెచ్ఎలు తీవ్రంగా నష్టపోతారని వాపోయారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెరుగైన వైద్యమందించాలి

ప్రజాశక్తి-కలిగిరి : కలిగిరి మండలం, దూబగుంట గ్రామం ఎస్‌సి కాలనీకి చెందిన, చవలమూడి బాబు, మమత దంపతులు వారి కుమార్తె, వైష్ణవి మృతి చెందిన విషయం విదితమే. వీరిలో తీవ్రంగా గాయపడిన మేఘనకు మెరుగైన వైద్యమందించాలని స్థానిక నాయకులు, పిచ్చపాటి చలపతి రెడ్డి, హాజరత్ రెడ్డి శివరామయ్య, పవన్ కళ్యాణ్, మాలకొండా రెడ్డి, ఎంఎల్ఎ కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ మండల నాయకులైన బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, రావులకొల్లు వెంగమనాయుడు, మృతుల కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించారు. వెంటనే నెల్లూరులోని కిమ్స్ వైద్యులకు ఎంఎల్ఎ ఫోన్ ద్వారా తెలియజేశారు. హుటాహుటిన ఆత్మకూరు నుండి మేఘనను నెల్లూరుకు తరలించారు. కిమ్స్ వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అదేవిధంగా మృతుల కుటుంబానికి బోర్ వెల్ లారీ ద్వారా ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసే నిమిత్తం, ఎఫ్ఐఆర్ నమోదు, పోస్టుమార్టం రిపోర్టు తదితర, పనులను స్థానిక నాయకులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కేసు నిమిత్తం అడ్వకేట్‌ను నియమించి ఇన్సూరెన్స్ క్లెయిమ్‌పై పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేల కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక నాయకులు అందజేశారు. మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ ఇచ్చిన అండను పలువురు ప్రశంసించారు.

కమిషనర్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజను తాడేపల్లి లోని ఆయన కార్యాలయంలో గురువారం జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు, రాష్ట్ర వీరల్ సెల్ కార్యదర్శి తీగల చంద్రశేఖర్ రావు తదితరులు ఉన్నారు.

కావలిలో ఎపి సురక్ష యాప్ వినియోగం

ప్రజాశక్తి-కావలి : కావలిలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యం. శంకరయ్య, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసులు నాయుడులు గురువారం కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి, కావలి పట్టణంలోని మద్యం దుకాణాలను, రెస్టారెంట్ అండ్ బార్లను పరిశీలించారు. దుకాణాలలో పనిచేస్తున్న నౌకరు నామధారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎపి ఎక్సైజ్ సురక్షయాప్‌ను వినియోగదారుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకుని వచ్చినందున సదరు యాప్‌ను ఏ విధంగా వినియోగించాలో వారికి తెలిపి, వినియోగదారులకు అమ్మే ప్రతి మద్యం సీసానుసదరు యాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి, విక్రయించాలని వారికి తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ ఎక్సైజ్ రూల్స్ ప్రకారం తప్పకుండా నిబంధనలను పాటిస్తూ, వ్యాపారం నిర్వహించాలని వారికి తెలియపరిచారు. ఏదైనా రూల్స్‌ను అతిక్రమించిన ఎడలసదరు షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదరు అధికారులతో పాటు కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత రక్తనిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-వింజమూరు :



వింజమూరు జెడ్‌పి హైస్కూల్‌లో వింజమూర్ రెడ్‌క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ క్యాంపులో 750 మందికి విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ ఇన్ రక్తపరచడం నిర్వహించారు. అందుకు పూర్తిగా సహకరించిన ఐఆర్‌సిఎస్ కావలి యూనిట్ టీం సభ్యులకు ఎంసి మెంబర్లకు ఐఆర్‌సిఎస్ నెల్లూరు యూనిట్ మెంబర్ బయ్యా ప్రసాద్ వారికి వింజమూర్ రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం.గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కె.వి.రత్నం ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వింజమూరు రెడ్‌క్రాస్ యూనిట్ జనరల్ సెక్రెటరీ శివ కోటారెడ్డి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణమహా'

ప్రజాశక్తి-ఎఎస్‌పేట :



మండలంలోని హసనాపురం, తెల్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమహా 8వ రాష్ట్రీయ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు జి.కస్తూరి, శ్రీదేవి, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఊబకాయం గురించి మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం లోపించిన, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గిన పిల్లలకు ఊబకాయం వస్తుందని తెలియజేశారు. పిల్లలు తినే ఆహారంలో ఉప్పు, చక్కెర, నూనెలు వంటి పదార్థాలు తక్కువగా వాడాలని, పిల్లలకు బయట ఆహారం అనగా కేకులు, పిజ్జాలు, బర్గర్లు, కూల్ డ్రింక్స్ తదితర ఆహార పదార్థాలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలియజేశారు. చిరుధాన్యాలతో చేసుకొనే ఆహారం పిల్లలకు తినిపించాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



నూనెగింజల పథకంపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని అప్పసముద్రం రైతు సేవా కేంద్రంలో నూనె గింజల పథకంపై రైతులకు మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేరుశనగ పంటలు వివిధ రకాల చీడపీడలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ అందించే ప్రతి పథకం రైతులు ఈ అవకాశాన్ని ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తీర్ణ అధికారి శేఖర్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎంఇఒ వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. అనంతరం ఎంఇఒ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చక్రకొలను మల్లికార్జున రావు మాట్లాడుతూ కార్మికులకు జులై, ఆగస్టులకు సంబంధించి వేతన బకాయిలు, బిల్లులు చెల్లించలేదన్నారు. భోజన నిర్వాహకుల ఖాతాలలో జమైనట్లు మెసేజ్ వచ్చాయని కానీ వారి ఖాతాలకు డబ్బులు జమ కాలేదన్నారు. అప్పులు చేసి ప్రతినెలా పిల్లలకువండి పెడుతున్నామని తామందరం పేదవారని వెంటనే తమ ఖాతాలకు వేతన బకాయిలు చెల్లించాలన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు పిల్లలకు వండి పెట్టే బియ్యం నేరుగా పాఠశాలలకు పంపాలన్నారు. క్లస్టర్ తాము బియ్యం తెచ్చుటకు తమకు రవాణా ఛార్జీలు రూ.200 వచ్చున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాలకు, భోజనం కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు గైడ్లెన్స్ ప్రకారం రూ.26వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతినెలా 5వ తేదీ లోపల వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. పిల్లలకు వంట వండి పెట్టేందుకు ప్రభుత్వం వారే గ్యాస్ సప్లై చేయాలన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా ఎంఇఒ సమావేశాన్ని నిర్వహించాలని, క్రీడా ఉత్సవాలు, పేరెంట్స్ మీటింగ్ లకు తాము వండి పెట్టిన భోజనానికి బిల్లులు చెల్లించడం లేదని ఇవన్నీ కూడా చెల్లించాలన్నారు. అన్న పూర్ణమ్మ, గాయత్రి, సునీత, దిల్షాద్, సుజాత, విజయ, ఆయాలు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెనోటీసు

ప్రజాశక్తి-కావలి
కావలి మున్సిపల్ కార్మికులు నవంబర్ 3వ తేదిన చేపట్టబోయే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్‌కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, మధ్యంతర భృతి 30శాతం ఇవ్వాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా విధుల్లో మరణించిన, రిటైర్డ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను అవుట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని కోరారు. డైలీవేజ్ కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లో తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల వలె 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయసు పొడిగించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇల్లు, ఇళ్లస్థలాలు కేటాయించి మున్సిపల్ కాలనీలో నిర్మించాలన్నారు. డైలీవేజ్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, మరణించిన కార్మికులకు పెండింగ్లో ఉన్న ఎక్స్‌గ్రేషియో వెంటనే ఇవ్వాలని డైలీవేజ్ కార్మికులకు జిల్లా కలెక్టర్ జిఒ ప్రకారం వేతనాలు పెంచాలని పట్టణ జనాభాకు తగ్గట్టు కార్మికులను పెంచాలని అవుట్‌సోర్సింగ్ పర్మినెంట్ కార్మికులకు బకాయిలు పెండింగ్‌లో ఉన్న రక్షణ పరికరాలు సబ్బులు, కొబ్బరినూ యూనిఫారం కుట్టు కూలీ చెప్పులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంతో జరిగిన మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో వర్క్ ఆఫ్ నేచర్‌ను బట్టి ప్రస్తుతం పనిచేస్తున్న ఇంజనీరింగ్ ఆఫీస్ సిబ్బంది స్కూల్ స్వీపర్సు వారికి వేతనాలు పెంచి చెల్లింపులు చేపట్టాలన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ అధ్యక్షుడు ఎండ్లూరి ఆది నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లె అంకయ్య, సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు, తదితరులు పాల్గొన్నారు.


సమ్మెనోటీసు అందజేస్తున్న నాయకులు


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెవివి సభ్యులు

18న మండలస్థాయి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్సు సంబరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కావాటి సురేష్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18న, మండలస్థాయిలో నవంబర్ 1న, జిల్లాస్థాయిలో నవంబర్ 23న, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీలలో నిర్వహించనున్నట్లు జెవివి నాయకులు తెలిపారు. గత సంవత్సరం ఐదు లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఒంటేరు మల్లికార్జున, సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సంధాని, విశ్రాంత ఉపాధ్యాయులు బడుగు శ్రీనివాసులు, షేక్ సాధిక్, నజీర్, సైన్సు ఉపాధ్యాయులు కవిత, కరుణ, జెవివి కార్యకర్తలు పాల్గొన్నారు.




వి.ఎస్.యు.లో వరల్డ్ ఫుడ్ డే

ప్రజాశక్తి-నెల్లూరు
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో "వరల్డ్ ఫుడ్ డే" వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ ఎస్.బి. సాయినాథ్ మాట్లాడుతూ "ఆహార భద్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. "ఆహార వృథాను తగ్గించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, ప్రజల్లో పోషకాహార విలువలపై చైతన్యం పెంపొందించడం ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ జె.నాగరాజు, డాక్టర్ శారద ఎబేటి, డాక్టర్ ఆర్.పావని పాల్గొన్నారు. విద్యార్థులు స్వయంగా ఆహార ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేసి, వివిధ రకాల పోషకాహార ఉత్పత్తులను ప్రదర్శించారు.

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాసరపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పసముద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి మెయిన్ పాఠశాలల్లో ఎంఇఒ టి.వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బోధనోపకరణాలను ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధన చేశారు. ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎ-2 పరీక్షలను పరిశీలిస్తూ 1, 2 తరగతుల విద్యార్థులను ఉపాధ్యాయుల స్వయంగా పరిశీలిస్తూ వారి వారి అసెస్మెంట్ బుక్‌లెట్స్ పూర్తి చేసే విధంగా జాగ్రత్తగా చూడాలని సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంను పరిశీలిస్తూ ప్రతిరోజు మెనూ ప్రకారం రుచి శుచికరంగా తయారు చేయాలని నిర్వహణకు తెలిపి విద్యార్థులతో కలిసి ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్‌బాషా, కె.చంద్రశేఖర్‌తో కలసి మధ్యాహ్నబడి భోజనం చేశారు. ముఖ్యంగా ఆయాలు సమయపాలన పాటిస్తూ ప్రతిరోజు ప్రభుత్వం సరఫరా చేసిన కెమికల్స్‌తో టాయిలెట్స్‌ను శుభ్రం చేయాలని తెలిపారు. గ్రంథాలయ పుస్తకాలను ప్రతిరోజు విద్యార్థులకు ఇచ్చి కనీసం అరగంట సేపైనా చదివించి ప్రతిరోజు రోజుకు అరగంట పాటు స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలిపి పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తూ నూటికి నూరు శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. అనంతరం తమ పాఠశాలకు మొదటిసారిగా విచ్చేసిన ఎఇఒ టి.వెంకటేశ్వర్లును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాసరపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ బాషా, ఉన్నత పాఠశాల అపసముద్రం ఇన్‌ఛార్జ్ హెచ్ఎం వి.జోయల్ కుమార్, ఉదయగిరి మెయిన్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ రజియా బేగం, ఎం.నవ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎఇఒ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

ఇళ్లల్లోకి మురుగునీరు

- రామాపురం రోడ్లన్నీ బురదమయం

ప్రజాశక్తి-బిట్రగుంట
బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో గురువారం కురిసిన వర్షానికి కాలువల నుండి బయటికి పోవాల్సిన మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతున్నాయి. ఇబ్రహీంపేట లోని కాలువలు 30 సంవత్సరాలకు క్రితం కట్టిన కాలువలు కావడంతో కొత్తగా వేసిన సిమెంట్ రోడ్లు ఎత్తుగా ఉండటంతో ఇబ్రహీంపేట నుండి పెట్రోల్ బంకు మీదుగా పోతున్న పెద్ద మురుగునీరు కాలువను చెరువు వరకు నిర్మించారు. పెట్రోల్ బంకు పక్కన నిర్మించిన దుకాణదారులు ముందు మురికి కాలువ ఉండడంతో దుకాణదారులు మురికి కాలువను మట్టి వేసి మూసివేశారు. ఇబ్రహీంపేట నుండి మురికి నీరు కాలువ ద్వారా బయటికి వెళ్లడం కష్టమైపోయి ఇళ్లల్లోకి మురికి నీరు వస్తున్నాయని గ్రామస్తులు పోతున్నారు. అసలే వర్షాకాలం దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని, ఉన్నత అధికారులు స్పందించి ఇబ్రహీంపేట లో కాలువలను మరమ్మత్తు చేసి మురికి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఇళ్లల్లోకి వచ్చిన మురుగునీరు

బోగోలు పంచాయతీ చెందిన రామాపురం గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ బురదమయమయ్యాయి. నడవడానికి వీలు కాకుండా బురదమయం అయిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి నివసిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడం లేదని, రాజకీయ నాయకులు ఓట్ల కోసం మాత్రమే తాము కనబడుతున్నామని, అభివృద్ధి మాత్రం తమ గ్రామంలో జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రామపురానికి కాలువలు నిర్మించి సిమెంట్ల రోడ్లను వెయ్యాలని గ్రామస్తులు కోరుతున్నారు.

18న మంత్రి ఆనం పర్యటన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి శనివారం ఆత్మకూరు మున్సిపాలిటీలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు బైపాస్ రోడ్డులో డంప్ యార్డును పరిశీలిస్తారు. అనంతరం 10.30 జిఎస్‌టిపై నిర్వహించే ర్యాలీలలో పాల్గొంటారు. 11.30 గంటలకు 111 మంది లబ్ధిదారులకు మున్సిపల్ బస్టాండ్‌లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. 125మంది మున్సిపల్ వర్కరకు రూ.6లక్షలు వెచ్చించి అందిస్తున్న రెండు జతల వస్త్రాలు, తదితర సామాగ్రి గల కిట్ల పంపిణీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పీయం సూర్యఘర్ పథకం ద్వారా మంజూరు చేసిన సోలార్ యూనిట్ ప్రత్యక్షంగా పరిశీలిస్తారని, పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజకవర్గంలో కూటమి నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని మంత్రి ఆనం క్యాంపు కార్యాలయం ప్రకటన ద్వారా కోరారు.

టపాసుల దుకాణాల యజమానులకు సూచనలు

ప్రజాశక్తి-అల్లూరు
స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో లైసెన్స్ కలిగిన టపాసులు దుకాణ యజమానుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దుకాణదారులు ప్రతిఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించి షాపులు ఏర్పాటు చేసుకోవాలని ప్రతిఒక్క షాపు యజమాని అగ్నిమాపక శాఖ సూచనలతో ప్రతి దుకాణం వద్ద నీటి డ్రమ్ములు పొడి ఇసుక అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా బాణాసంచా షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు షాప్ కి షాప్ కి మధ్య ఐదు నుంచి పది అడుగుల దూరం ఉండేలా చూడాలన్నారు. ఎవరైనా టపాసులు అధిక ధరలకు అమ్ముతున్నారని వినియోగదారుల వద్దనుండి పిర్యదులు వస్తే షాపు యజమానిపై చట్టపరమైన చర్యలు చేపడతామని డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రజినీకాంత్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రభుదీప్, షాపుల యజమానులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేదలకు లబ్ధి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఎస్‌టి 2.0 పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని కె.వి.ఆర్ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన జిఎస్‌టి 2.0 సేవింగ్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిఎస్టి తగ్గించడం వల్ల నిత్యావసర సరుకులతోపాటు, రవాణా శాఖకు సంబంధించిన ట్రాక్టర్, మోటార్ సైకిళ్లు, కూడా భారీ స్థాయిలో ధరలు తగ్గడం వల్ల రైతులకు పేద ప్రజలకు మేలు జరిగిందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల అభ్యున్నతకు పాటుపడుతున్నారని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలలో అధికారులు జిఎస్టి తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కార్తీక్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, పవ్వేరు కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, పట్టణ, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీశ్, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్, పలువురు కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీని ఎంపిడిఒ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులతో ప్రభుత్వ హైస్కూల్ నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎస్‌టి స్టేట్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ షేక్ షారీనా, మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసులు, రోడ్డు రవాణా శాఖ అధికారి కరుణాకర్, టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్ బయన్న మాట్లాడారు. సుంకాల యుద్ధంలో ప్రజలను ఆదుకునేందుకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధిక జిఎస్‌టిని తగ్గించి ప్రతి సామాన్య ప్రజలనుండి కొనుగోలు శాతాన్ని పెంచిందన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



విద్యార్థినులకు బహుమతులందజేస్తున్న దృశ్యం

జాతీయ స్థాయిలో నిర్వహించిన పద్యాల పోటీలలో తొలి 20 స్థానాలలో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు నిలవడం గర్వకారణమని బుచ్చిరెడ్డిపాలెం మండల విద్యాశాఖాధికారి ఎం.దిలీప్ కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పెద్దూరు బెజవాడ బుజ్జమ్మ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో లవ్ పీపుల్ ఫౌండేషన్ నిర్వహించిన వేమన పద్యాల జాతీయ పోటీలలో 13, 16 స్థానాలు పొందిన పి.పావని, ఎం.లక్ష్మీ ప్రసన్నలను అభినందించి గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలలో విలువలు, జీవన నైపుణ్యాలు,లోకం పోకడ ఉంటాయన్నారు. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో సాహిత్యాన్ని పరిచయం చేసిన వేమనలోకం వీడి ఆరు శతాబ్దాలైన అందరి హృదయాలలో చిరస్థాయిగా ఉన్నారన్నారు. తెలుగు సాహిత్యాన్ని అందరికీ అందిస్తూ, మధురిమలను పంచుతూ, విశేష కృషి సల్పుతున్న గండికోట సుధీర్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుజాత, తెలుగు ఉపాధ్యాయులు రమణమ్మ, రాధిక పాల్గొన్నారు.



సిఆర్‌ఎంటికి ఘన సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి
డిఎస్‌సి 2025లో ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సిఆర్‌ఎంటిగా విధులు నిర్వహిస్తున్న ఎ.వెంకటేశ్వర్లు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో ఉద్యోగం సాధించిందంతో ఎంఇఒ కార్యాలయంలో ఎన్‌జిఒలు సిబ్బందితో ఘన సన్మానం నిర్వహించారు. సమావేశంలో ఎంఇఒలు షేక్ మస్తాన్ వలీ, టి.శ్రీనివాసులు, టి.వెంకటేశ్వర్లు పాల్గొని వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించి మండల విద్యా వ్యవస్థలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఇఒ కార్యాలయ సిబ్బంది సిఆర్‌ఎంటిలు, ఎంఐఎస్, డేటాఎంట్రీ ఆపరేటర్, మెస్సెంజర్ పాల్గొన్నారు.



గణేశ్వరాపురం పాల సొసైటీకి మొదటి స్థానం

ప్రజాశక్తి-వరికుంటపాడు
నెల్లూరు జిల్లా విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో 2024-25 సంవత్సరానికి గానూ వరికుంటపాడు మండలం గణేశ్వరాపురం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో 85 పాల సొసైటీలు, 360 సెంటర్‌లు ఉండగా వరుసుగా రెండవసారి కూడా గణేశ్వరాపురం సహకార సంఘం 2024-25 సంవత్సరానికి గానూ 1,86,370 లీటర్ల పాలను సేకరించినందుకు గణేశ్వరాపురం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంకు ప్రథమ స్థానం దక్కింది. ఇందుకుగానూ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ప్రెసిడెంట్ బాదం వెంకటనారాయణ రెడ్డిని నెల్లూరు విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో విజయ డైరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్, డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి చేతుల మీదగా బాదం వెంకటనారాయణ రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటినుండి వచ్చే ఏడాది అక్టోబర్ వరకు పాడి రైతులకు లీటరుకు 50 పైసలు వంతున బోనస్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ప్రెసిడెంట్లు, అధికారులున్నారు.

ఆ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలే..!

నివారణ చర్యలు తీసుకోవాలని వాహనాదారుల వినతులు


రోడ్డు ప్రమాదాలకు నిలయమైన అల్లూరు రోడ్డు ప్రాంతం

ప్రజాశక్తి-దగదర్తి
అల్లూరు రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వాహన దారులు తమ వినతులను తెలియజేస్తున్నారు. అల్లూరు రోడ్డు దగ్గర ఉన్న ఒక్క ఫ్లై ఓవర్ ఉండడంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకి మధ్యలో ఏర్పాటు చేసిన రాళ్లను ఢీ కొట్టడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోవడం జరుగుతుంది. అయితే గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఆరెంజ్ ట్రావెల్స్ హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తుండగా అల్లూరు రోడ్డు సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన రాళ్ళను ఢీకొట్టడంతో బస్సు ఒక్కసారిగా రోటికి అడ్డం తిరగడంతో సుమారు ఐదు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోవడంతో వాహనాల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చిన్నపిల్లలు వద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని దగదర్తి ఎస్ఐ జంపన్ కుమార్ తెరవడంతో వెంటనే ఘటన స్థలాన్ని చేరుకొని రోడ్డుకి అడ్డంగా తిరిగి ఉన్న ఆరంజ్ ట్రావెల్స్ బస్సును క్రేన్ ద్వారా రోడ్డు పక్కన పెట్టి రాకపోకలకు సాగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన బ్రిడ్జిని నిర్మాణం చేపట్టి రాకపోకల సాగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.